# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...








సంపుటి : 2 | సంచిక : 327 | శుక్రవారం 26 జూలై 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# 2,91,191

## తెలంగాణ పూర్తిస్థాయి బడ్జెట్

రెవెన్యూ వ్యయం - రూ.2,20,945 కోట్లు

మూలధన వ్యయం - రూ.33,487 కోట్లు

తెలంగాణ తలసరి ఆదాయం - రూ.3,47,299

తెలంగాణ ఏర్పాటు నాటికి అప్పు - రూ. 75,577 కోట్లు.

ఈ ఏడాది డిసెంబర్ నాటికి అప్పు - రూ. 6.71 లక్షల కోట్లు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రూ. 42 వేల కోట్ల బకాయిలు చెల్లింపు.



- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో భారీ కేటాయింపులు..
- ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం
- హర్టికల్చర్ కోసం ఈ బడ్జెట్‌లో రూ.737 కోట్లు
- వ్యవసాయానికి సాంకేతికతను జోడించేందుకు ప్రయత్నాలు
- సన్నవడ్లు పండించే రైతులకు క్వింటాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం
- యువతలో నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు : ఆర్థిక మంత్రి

తెలంగాణ 2024-25 వార్షిక బడ్జెట్‌ను ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రూ.2 లక్షల 91 వేల 159 కోట్లతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా ప్రతిపాదించారు. సంక్షేమం, అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు తెలుస్తోంది. మెట్రో వాటర్ వర్క్సకు రూ.3,385 కోట్లు, నూతనంగా ఏర్పాటు చేసిన హైడ్రాకు రూ.200 కోట్లు, జీహెచ్ఎంసీలో మౌలిక వసతులు కల్పనకు రూ.3,065 కోట్లు, హెచ్ఎండీఏలో మౌలిక వసతుల కల్పనకు రూ.500 కోట్లు, వ్యవసాయానికి రూ.72,659 కోట్లు, ఉద్యానవనం రూ.737 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,980 కోట్లు కేటాయించారు. ఇక రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం కోసం రూ.723 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,418 కోట్లు ప్రతిపాదించారు.

- లో



## కాళేశ్వరం నుంచి ఎన్ని టీఎంసీల నీటిని ఇచ్చారు..?

- రెండు టీఎంసీల నీరు రాలేదు కానీ రూ. 2 వేల కోట్లతో మూడో టీఎంసీ నీటి గురించి మాట్లాడుతున్నారు
- వర్షాకాలంలో నీళ్లు వస్తున్నాయి..
- కానీ తాము కడితేనే వస్తున్నాయని చెప్పుకునే ప్రయత్నం బీఆర్ఎస్ నేతలు చేస్తున్నారు
- అధికారంలో ఉన్నప్పుడు నిర్వాసితులను ఎందుకు పట్టించుకోలేదు

హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి కరీంనగర్ జిల్లాకు ఎన్ని టీఎంసీల నీటిని రైతులకు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. నాయకులు తమ జిల్లాలో ఉన్న లోయర్, మిడ్ మానేరు డ్యామ్ పరిశీలనకు వెళ్తున్నారని తెలిపారు. 2టీఎంసీల నీటి కోసం తీసుకున్న ప్రణాళిక ఎందుకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు కాలేదని ప్రశ్నించారు. ఈరోజు(గురువారం) సెక్రటేరియట్ మీడియా పాయింట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... రెండు టీఎంసీల నీరు - మిగతా3లో

## రాష్ట్రపతి భవన్‌లోని అశోక్, దర్బార్ హాళ్ల పేర్ల మార్పు..




- ప్రియాంక గాంధీ విమర్శలు
- దర్బార్ హాల్‌ను 'గణతంత్ర మండపం'గా మార్పు
- అశోక్ మండపంగా మారిన అశోక్ హాల్
- భారతీయ సాంస్కృతిక విలువలను ప్రతిబింబించేలా పేర్లను మార్చినట్టు రాష్ట్రపతి భవన్ ప్రకటన



## రాష్ట్రానికి అన్యాయం జరిగింది

- ఢిల్లీలో టీ కాంగ్రెస్ ఎంపీల ధర్నా!
- విభజన చట్టంలో ఇచ్చిన హామీలను ఏపీకి మాత్రమే అమలు చేశారని ఆవేదన
- బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై ప్రధానికి, కేంద్ర ఆర్థిక శాఖకు లేఖలు రాసినట్లు వెల్లడి
- తెలంగాణకు న్యాయం జరిగే వరకు పార్లమెంట్‌లో పోరాడుతామని వ్యాఖ్య

ఢిల్లీ

బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపులు చేయడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, కానీ తెలంగాణకు ఇవ్వకపోవడాన్ని ప్రశ్నిస్తున్నామని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఢిల్లీలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా - మిగతా3లో


# రైతు వ్యతిరేక బడ్జెట్



- బడ్జెట్ ప్రసంగంలా లేదు..
- రాజకీయ సభల్లో చెప్పినట్టుగా ఉంది
- భట్టి బడ్జెట్ ప్రసంగంపై కేసీఆర్ ఫైర్
- బడ్జెట్‌ను చూస్తుంటే ఇది రైతు శత్రువు ప్రభుత్వం అని తేలిపోయింది
- అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచింది
- గత ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని ఆర్థికాభివృద్ధిని కాంక్షించి అనేక పథకాలను ప్రవేశపెట్టింది.
- అట్టడుగు వర్గాల గొంతు కోసిందని ధ్వజం
- మహిళలకు వడ్డీ లేని రుణాలు పాత పథకమే

హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బడ్జెట్‌ను చూస్తుంటే ఇది రైతు శత్రువు ప్రభుత్వం అని తేలిపోయిందన్నారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని కేసీఆర్ పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం ముగిసిన అనంతరం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద కేసీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని ఆర్థికాభివృద్ధిని కాంక్షించి అనేక పథకాలను ప్రవేశపెట్టింది. యాదవ సోదరుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన గొర్రెల పంపకం పథకాన్ని మూసివేసినట్టు అర్థమవుతుంది. అట్టడుగు వర్గాల గొంతు కోసింది. దళిత బంధు ప్రస్తావన లేనే లేదు. ఇది చాలా దుర్మార్గం. దళిత సమాజం - మిగతా3లో



## నీట్ యూజీ సవరించిన ఫలితాలు విడుదల

- 5 మార్కులు కోల్పోయిన 4 లక్షల మంది విద్యార్థులు
- నీట్ యూజీ ఫలితాలపై సుప్రీం కోర్టు తీర్పు ప్రభావం
- ఓ ఫిజిక్స్ ప్రశ్నకు గ్రేస్ మార్కులు ఇచ్చిన ఎన్టీయే
- ఆప్షన్ 4 టిక్ చేసిన వారికే మార్కులు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు
- కోర్టు తీర్పు మేరకు ఫలితాలను సవరించిన ఎన్టీయే

# కాంగ్రెస్ + రాష్ట్ర బడ్జెట్ = గాడిద గుడ్డేనా?



- 6 గ్యారంటీలు + రాష్ట్ర బడ్జెట్ = గాడిద గుడ్డేనా?
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- బడ్జెట్ కేటాయింపులకు సరిపడ ఆదాయం ఎక్కడి నుండి సమకూర్చుకుంటారో బడ్జెట్ లో లెక్కా పత్రం చూపకపోవడం విడ్డూరం

హైదరాబాద్

గాడిద గుడ్డు పెట్టడం ఎంత నిజమో.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడం అంతే నిజమనే దానికి బడ్జెట్ నిదర్శనం. భట్టి విక్రమార్క. మీరు చదివింది ఆర్థిక బడ్జెట్టా లేక అప్పుల పత్రమా..? అప్పులున్నందున హామీలను అమలు చేయలేమని చేతులెత్తేస్తున్నారా? అప్పులున్న విషయం ముందు మీకు తెలిసి కూడా 6 గ్యారంటీలిచ్చిన మీరు వాటన్నింటికీ బడ్జెట్ లో నిధులెందుకు కేటాయించలేదు? - మిగతా3లో

## జనజీవనం అస్తవ్యస్తం

- దంచికొడుతున్న వర్షాలు..
- పలు రైళ్లు రద్దు, కరెంట్ షాక్‌తో ముగ్గురు మృతి
- అంధేరి సబ్‌వేలో వాహనాల రాకపోకలకు అంతరాయం
- భారీ వర్షాల కారణంగా ప్రజా రవాణా సేవలకు అంతరాయం ఏర్పడి అనేక చోట్ల ట్రాఫిక్ స్తంభించింది



# జనజీవనం అస్తవ్యస్తం



భారీ వర్షాల కారణంగా మహారాష్ట్రలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ముంబైలోని అంధేరి సబ్‌వేలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతోపాటు కుండపోత వర్షాలతో ముంబైలోని లోతట్టు ప్రాంతాలకు పెద్ద ఎత్తున నీరు చేరింది. రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజా రవాణా సేవలకు అంతరాయం ఏర్పడి అనేక చోట్ల ట్రాఫిక్ స్తంభించింది. మరోవైపు పూణె, కొల్హాపూర్‌లోని పలు ప్రాంతాలు జలదిగ్బంధం ఏర్పడి జనజీవనం స్తంభించింది. పాఠశాలలు మూసివేయబడ్డాయి. పూణేలోని పింప్రి చించ్‌వాడ్‌లోని అనేక నివాస అపార్ట్‌మెంట్లు జలమయమయ్యాయి. ఏక్తా నగర్ వంటి వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు అగ్నిమాపక శాఖ పడవలను ఉపయోగిస్తోంది. కొన్ని చోట్ల నడుము మట్టం వరకు నీరు చేరుకుంది. ఈ క్రమంలో పలు చోట్ల రైళ్లను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

**ముగ్గురు మృతి**

పూణెలో గురువారం తెల్లవారుజామున భారీ వర్షాల కారణంగా నీట మునిగిన హ్యాండ్‌కార్ట్‌ను తరలించే ప్రయత్నంలో ముగ్గురు వ్యక్తులు విద్యుదాఘాతంతో మరణించారని పోలీసులు తెలిపారు. డెక్కన్ జింఖానా ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్లు వారు తెలిపారు. ఖడక్‌వాస్లా డ్యామ్ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా గురువారం డ్యాం పూర్తి స్థాయికి చేరుకుంది. కురుస్తున్న వర్షాల కారణంగా నీటి మట్టం పెరగడంతో ముతా నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. ఈ క్రమంలో పూణె జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాంతాలను 48 గంటల పాటు మూసివేయాలని లెక్టర్ సుహాస్ దివాసే ఆదేశించారు. మునిగిపోయే ప్రమాదం ఉన్న వంతెనలపై ట్రాఫిక్‌ను నిషేధిస్తామని ఆయన వెల్లడించారు.

**రెడ్ అలర్ట్**

భారీ వర్షాల కారణంగా ఖడక్ వాస్లా డ్యాం కూడా పూర్తి స్థాయికి చేరుకుంది. నగరానికి నీటిని సరఫరా చేసే ఏడు సరస్సులలో ఒకటైన విహార్ సరస్సు ఈరోజు తెల్లవారుజామున పొంగిపొర్లడం ప్రారంభించిందని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ తెలిపింది. వాతావరణ శాఖ గురువారం మహారాష్ట్రకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ క్రమంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచనలు జారీ చేసింది. పశ్చిమ మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పంచగంగా నది ప్రమాద స్థాయి కంటే కొన్ని అంగుళాల దిగువన ప్రవహిస్తోందని అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు నమోదైన లెక్కల ప్రకారం రాజారాం వాగు వద్ద పంచగంగా నీటి మట్టం 42.2 అడుగులకు చేరుకుంది. ఇది ప్రమాదకర స్థాయి 43 అడుగుల కంటే 8 అంగుళాల దిగువన ఉందన్నారు.

# ఉచిత పథకాల పేరిట భావితరాలపై భారం మోపొద్దు



వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత పథకాలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వివిధ వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ఉచిత పథకాల్లో స్థిరత్వం తేవాల్సిన అవసరం ఉందని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఉచిత పథకాల అమలుతో భవిష్యత్ తరాలపై భారం మోపవద్దని తెలిపారు. 'మీరు (రాజకీయ పార్టీలు) ప్రకటించే ఉచిత పథకాలను ఈనాడు సమర్థించుకోవచ్చు. కానీ ప్రజాభిప్రాయం ప్రకారం పన్నుచెల్లింపుదారులకు జవాబుదారీగా ఉండాలి. మీరు కొందరు వ్యక్తుల నుంచి పన్ను వసూలు చేసి మరికొందరికి ఇస్తున్నారు. ఉచిత పథకాలకు అర్హులై ఉండాలి' అని పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ సమర్పించిన మరుసటి రోజు టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.


ఏది ఏమైనా, ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం నుంచి తాగునీరు, విద్యుత్, ప్రాథమిక ఆరోగ్యం, విద్యారంగాలకు సరిపడా నిధులు కేటాయించాలని నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే ఉచిత పథకాల నుంచి ఎవరైనా లబ్ధి పొందొచ్చు, కానీ ఇతర పన్ను చెల్లింపు దారులపై ప్రతికూల ప్రభావం ఏర్పడకుండా ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. నగదు బదిలీ పథకం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర ఐదు హామీలతో గతేడాది కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్న సంగతిని ఆమె గుర్తుచేశారు. 'కర్ణాటకలో ఏం జరుగుతుందో చూడండి. అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధుల్లేవని చెప్పకుండా ఎన్నికల హామీలను తప్పనిసరిగా గౌరవించాలి' అని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి, పురుషులపై బస్సు ప్రయాణ చార్జీలు రెట్టింపు చేయడం వల్ల కుటుంబాలపైనే భారం పడుతుందని నిర్మలా సీతారామన్ గుర్తు చేశారు. ఉచిత పథకాలపై నిజాయితీతో కూడిన చర్చ జరుగాలన్నారు. 'ఉచితాలపై మీరు నిజాయితీగా చర్చ పెట్టండి. మీరు ఇచ్చే ఉచిత పథకం ఆమోద యోగ్యం కాదని అంత తేలిక్కాదు. నేను అమలు చేసే సంక్షేమ పథకాన్ని సమర్థించుకోవాలి' అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టుతోపాటు వివిధ విధాన నిర్ణేతలు తరుచుగా ఉచిత పథకాలు, సంక్షేమ పథకాల మధ్య తేడాలు చెప్పడం చాలా కష్టం అని చెబుతున్నారు.

## ఆమ్ ఆద్మీ పార్టీకి అనుకూలంగా కోర్టు కీలక ఆదేశాలు.. కదిలిన మోదీ సర్కార్



**న్యూఢిల్లీ :** ఢిల్లీ హైకోర్టు ఆదేశాలతో న్యూఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీకి కొత్త కార్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. స్థానిక లుటియన్స్ ప్రాంతంలోని పండిట్ రవి శంకర్ శుక్లా లేన్‌లో బంగ్లా నెం1ను ఆప్‌కి ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ఆప్ వర్గాలు గురువారం వెల్లడించాయి. అయితే ఆప్ జాతీయ పార్టీ అని.. ఆ పార్టీకి నూతన కార్యాలయం కేటాయించేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ ఆ పార్టీ నేతలు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై ఢిల్లీ హైకోర్టు ఇటీవల స్పందించింది. ఆ క్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ పార్టీ అని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ పార్టీకి కొత్త కార్యాలయం కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. అయితే జులై 25వ తేదీలోగా ఆప్‌కి కొత్త కార్యాలయం ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి గడువు విధించింది. దీంతో ఆప్‌కు కేంద్రం కొత్త కార్యాలయాన్ని కేటాయించింది. ఆమ్ ఆద్మీ పార్టీకి ఇప్పటి వరకు రౌస్ అవెన్యూలో కార్యాలయం ఉందన్న విషయం అందరికీ తెలిసిందే. మరోవైపు ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మని లాండరింగ్ వ్యవహారంలో అరెస్టయిన ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీహార్ జైల్లోనే ఉన్నారు. ఆయన ఆరోగ్యం క్షీణిస్తుందంటూ ఆ పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. కేజ్రీవాల్‌ను తీహార్ జైల్లోనే అంతమొందించేందుకు అటు బీజేపీ, ఇటు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు గుప్పిస్తున్నారు. అలాంటి వేళ.. తీహార్ జైలు అధికారులు కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఇటీవల నివేదిక విడుదల చేశారు. మద్యం కుంభకోణంలో ఈడీ అరెస్ట్‌తో జైలుకెళ్లిన సీఎం కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం విధితమే. అయితే అప్పటికే ఆయన్ని ఇదే కేసులో సీబీఐ అరెస్ట్ చేసింది. దాంతో ఈడీ అరెస్ట్‌లో బెయిల్ వచ్చినా.. సీబీఐ అరెస్ట్‌తో మళ్లీ కేజ్రీవాల్ జైలుకే పరిమితమయ్యారు. అలాంటి వేళ.. కేజ్రీవాల్ పట్ల ఓ విధమైన ద్వేష భావంతో వ్యవహరిస్తుందని మోదీ ప్రభుత్వంపై ఆప్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

## నీట్ యూజీ సవరించిన ఫలితాలు విడుదల..



నీట్ యూజీ-2024 తుది ఫలితాలను జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ (ఎన్టీయే) నేడు విడుదల చేసింది. సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు మేరకు సవరించిన ఫలితాలను నేడు ఎన్టీయే వెల్లడి చేసింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ తుది ఫలితాలు విడుదలయ్యాయి. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ గురువారం సవరించిన ఫలితాలను విడుదల చేసింది. నీట్ యూజీ-2024 పరీక్షలో అడిగిన ఒక వివాదాస్పద ఫిజిక్స్ ప్రశ్నకు కచ్చితమైన సమాధానాన్ని మాత్రమే అంగీకరించాలని, ఇతర సమాధానాలకు మార్కులు రావని సుప్రీంకోర్టు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీం ఆదేశాలకు అనుగుణంగా ఎన్టీయే వ్యవహరించింది. ఈ నిర్ణయంతో 4 లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులను కోల్పోయారు. సవరించిన ఫలితాలను ఎన్టీయే అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు.

**సుప్రీం తీర్పు..**

కాగా, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ లీకేజీ కేసులో సుప్రీంకోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. నీట్ యూజీ పరీక్షను మరోసారి నిర్వహించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ప్రశ్నాపత్రం లీకైందని చెప్పేందుకు తగిన ఆధారాలు లేవని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. పాట్నా, హజారీబాగ్‌లలో మాత్రమే పేపర్ లీక్ అయిందని పేర్కొన్నది. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఆదేశిస్తే, గతంలో పరీక్ష రాసిన దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులపై ప్రభావం చూపుతుందని అభిప్రాయ పడింది. ఈ మేరకు మే 5న నిర్వహించిన నీట్ యూజీ-2024 పరీక్షను రద్దు చేయాలని, మరోసారి పరీక్ష నిర్వహించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేడీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కొట్టివేసింది.

**ఆ నీట్ ప్రశ్నకు ఒక్కటే సమాధానం!**

నీట్ యూజీ-2024 పరీక్షలో అడిగిన ఒక వివాదాస్పద ఫిజిక్స్ ప్రశ్నకు సరైన సమాధానంపై ఢిల్లీ ఐఐటీ నిపుణుల కమిటీ మంగళవారం సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించింది. ఆ ప్రశ్నకు సరైన సమాధానం ఒక్కటేనని స్పష్టం చేసింది. సంబంధిత ప్రశ్నకు ఇచ్చిన ఆప్షన్లలో నాలుగోది మాత్రమే సరైన సమాధానం అని ముగ్గురు నిపుణులతో కూడిన కమిటీ తేల్చిందని ధర్మాసనం తెలిపింది. 'స్టేట్‌మెంట్ 1 కరెక్ట్.. స్టేట్‌మెంట్ 2 కరెక్ట్ కాదు' అని ఆ నాలుగో ఆప్షన్ చెబుతున్నదని పేర్కొన్నది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కూడా 4వ ఆప్షన్‌నే సరైన సమాధానంగా ఆన్సర్ కీలో సవరించాలని తెలిపింది. ప్రశ్న నంబర్ 29కు నాలుగో ఆప్షన్ మాత్రమే సరైన సమాధానమని తేల్చింది. ఈ నేపథ్యంలోనే సవరించిన ఫలితాల్లో నాలుగు లక్షల మంది ఐదు మార్కులను కోల్పోవాల్సి వచ్చింది.

## పరీక్షల నిర్వహణలో కీలక మార్పులకు శ్రీకారం..

నీట్ - యూజీ పేపర్ లీక్ అంశం దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. పరీక్ష నిర్వహణలో ఎన్నో లోపాలున్నాయని ఇటీవలే సుప్రీంకోర్టు సైతం తేల్చి చెప్పింది. దీంతో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ దిద్దుబాటు చర్యలకు పూనుకుంది. పరీక్షల నిర్వహణ విధానంలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే పరీక్షల నిర్వహణలో అధునాతన డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని నిర్ణయించింది. అభ్యర్థుల కోసం అత్యాధునిక ఆధార్ అథెంటికేషన్, ఫింగర్‌ప్రింట్ తీసుకోవడం, ఫేషియల్ రికగ్నిషన్ వంటి చర్యలతో ఎక్కడా ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని యోచిస్తోంది. సీసీ కెమెరాలతో నిఘా పెంచడం, అందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ని వినియోగించడం, ఈ-అడ్మిట్ కార్డ్‌లపై కోడ్ స్కానింగ్ వంటి చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఎగ్జామ్ నిర్వహించిన సమయంలో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతోంది. యూపీఎస్సీ ఏటా 14 పరీక్షలు నిర్వహిస్తోంది. ఇందులో సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ కూడా ఉంది. వీటితో పాటుగా ప్రభుత్వంలో ఉన్నత ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షలు, ఇంటర్వ్యూలనూ నిర్వహిస్తోంది. యూపీఎస్సీ నిర్వహించే పరీక్షల సమయంలో సాంకేతిక సేవలను అందించేందుకు ప్రభుత్వ రంగ సంస్థలను బిడ్స్‌కు ఆహ్వానిస్తూ టెండర్ దాఖలు చేసింది. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో పరీక్షల ఆధారిత ప్రాజెక్టుల ద్వారా కనీసం రూ.100 కోట్లు సగటు టర్నోవర్ కలిగి ఉన్న సంస్థలు మాత్రమే బిడ్ వేయాలని యూపీఎస్సీ తన టెండర్‌లో స్పష్టం చేసింది. అదేవిధంగా, పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్, ఎగ్జామ్ సెంటర్ల జాబితా, ఎంతమంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారు వంటి వివరాలను పరీక్షకు రెండు లేదా మూడు వారాల ముందు సర్వీస్ ప్రొవైడర్లకు అందజేస్తామని పేర్కొంది.

## రాష్ట్రపతి భవన్‌లోని అశోక్, దర్బార్ హాళ్ల పేర్ల మార్పు..




దేశ రాజధాని న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో వివిధ వేడుకలు నిర్వహించే రెండు ముఖ్యమైన హాళ్ల పేర్లు మారాయి. దర్బార్ హాల్ పేరును 'గణతంత్ర మండపం'గా, అశోక్ హాల్‌ను 'అశోక్ మండపం'గా మార్చుతున్నట్టు రాష్ట్రపతి సెక్రటేరియెట్ ప్రకటించింది. భారతీయ సాంస్కృతిక విలువలను ప్రతిబింబించేలా పేర్లను మార్చుతున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిర్ణయించారని వెల్లడించింది. భారత రాష్ట్రపతి కార్యాలయం, నివాసమైన 'రాష్ట్రపతి భవన్' దేశానికి ప్రతీక అని, దీనిని ప్రజలకు మరింత అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తున్నామని వివరించింది. కాగా జాతీయ అవార్డులతో పాటు పలు ముఖ్యమైన వేడుకలను 'దర్బార్ హాల్'లోనే నిర్వహిస్తుంటారు. 'దర్బార్' అనే పదం నాటి రాజులు, బ్రిటిష్ కాలం నాటి న్యాయస్థానాలు, సమావేశాలను ప్రతిబింబిస్తోంది. దేశం గణతంత్రంగా మారిన తర్వాత ఈ పదానికి ఔచిత్యం లేకుండా పోయింది. అందుకే దర్బార్ పదానికి బదులుగా 'గణతంత్ర మండపం'గా రాష్ట్రపతి భవన్ పేరు మార్చింది. ఇక 'అశోక్ హాల్'ను బ్రిటీష్ కాలంలో 'బాల్‌రూమ్'గా ఉపయోగించేవారు. అంటే చాలా పెద్దగా ఉండే ఈ రూమ్‌లో పార్టీలు నిర్వహించేవారు. 'అశోక్' అనే పదం 'అన్ని బాధల నుంచి విముక్తి' లేదా 'ఏ దుఃఖమూ లేదు' అనే అర్థానిస్తుంది. అదేవిధంగా అశోక్ చక్రవర్తి చాటిచెప్పిన ఐక్యత, శాంతియుత సహజీవనానికి కూడా సంకేతంగా ఉంది. అయితే 'అశోక్ హాల్' పేరులో హాల్ అనే పదం ఇంగ్లీష్‌లో ఉంది. భాషలో ఏకరూపతను సూచించేలా ఇంగ్లీష్ ఆనవాళ్లు లేకుండా 'అశోక మండపం' అని పేరు మార్చుతున్నట్టు రాష్ట్రపతి భవన్ వివరించింది. పేర్లు మార్చుతూ రాష్ట్రపతి భవన్ తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తప్పుబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం 'దర్బార్' అనే భావన లేదు, కానీ చక్రవర్తి అనే భావన నేటికీ ఉందని మండిపడ్డారు. కాగా నిరుడు 'మొఘల్ గార్డెన్స్'గా పేరుగాంచిన రాష్ట్రపతి భవన్ గార్డెన్స్ పేరును 'అమృత్ ఉద్యాన్'గా ప్రభుత్వం మార్చిన విషయం తెలిసిందే.

# భారత్‌లోని ఈ నగరాలకు వెళ్లకూడదు



**వాషింగ్టన్:** భారత్‌లో ఉంటున్న తమ దేశ పౌరులకు అమెరికా హెచ్చరికలు జారీ చేసింది. మణిపుర్, జమ్ము కశ్మీర్, భారత్-పాకిస్థాన్ సరిహద్దులతో పాటు మావోయిస్టులు యాక్టివ్‌గా ఉన్న మధ్య, తూర్పు భారత దేశ ప్రాంతాలకు వెళ్లొద్దని సూచించింది. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలకు వెళ్తుంటే మళ్లీ ఆలోచించాలంటూ రివైజ్డ్ ట్రావెల్ అడ్వైజరీని ఆ దేశ విదేశాంగ శాఖ విడుదల చేసింది. దేశంలో పెరిగిపోతున్న నేరాలు, ఉగ్రవాద కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది.

భారత్-పాకిస్థాన్ సరిహద్దులోని 10 కి.మీల పరిధిలో కాల్పులు జరిగే అవకాశం ఉందని.. అటువైపు వెళ్లొద్దని, తూర్పు లద్దాఖ్ ప్రాంతం, లేహ్ మినహా కేంద్రపాలిత ప్రాంతమైన జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదం పేట్రేగుతోందని అక్కడ పర్యటించడం శ్రేయస్కరం కాదని హెచ్చరించింది. ఉగ్రవాదం, హింసాత్మక ఘటనల కారణంగా ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటనపై పునరాలోచించాలని సూచించింది. పర్యాటక ప్రాంతాలు, ఇతర చోట్ల అత్యాచారాలు, లైంగిక వేధింపులు వంటి హింసాత్మక నేరాలు జరిగాయని భారతీయ అధికారులు తెలిపారు. ఉగ్రవాదులు పర్యాటక ప్రాంతాలు, రవాణా కేంద్రాలు, షాపింగ్ మాల్స్, ప్రభుత్వ సంస్థలను లక్ష్యంగా చేసుకుంటారని అమెరికా తెలిపింది. భారత్-పాక్ మధ్య నియంత్రణ రేఖ వెంబడి హింసాత్మక ఘటనలు సాధారణంగా జరుగుతుంటాయని.. ఇది కశ్మీర్‌లోయలోని పర్యాటక ప్రదేశాలైన శ్రీనగర్, గుల్‌మార్గ్, పహల్గామ్‌లలో చోటుచేసుకుంటాయని వెల్లడించింది. అందువల్ల ఈ పర్యాటక ప్రాంతాల్లో నియంత్రణ రేఖ వెంబడి కొన్ని ప్రాంతాలను సందర్శించేందుకు భారత ప్రభుత్వం కూడా విదేశీ పర్యటకులను అనుమతించొద్దని కోరింది.

**ఈ ప్రాంతాల్లో చురుగ్గా మావోయిస్టులు..**

సరిహద్దు వెంబడి ఇరు దేశాల సైనిక బలగాలు మోహరించి ఉంటాయని.. తూర్పు మహారాష్ట్ర, ఉత్తర తెలంగాణ నుంచి పశ్చిమ బెంగాల్ మీదుగా విస్తరించి ఉన్న ప్రాంతంలో మావోయిస్టులు చురుగ్గా ఉంటాయని తెలిపింది. తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్, బిహార్, బెంగాల్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, యూపీలలో ప్రభుత్వ అధికారులపై దాడులు జరుగుతున్నాయని, ఒడిశాలోని నైరుతీ ప్రాంతంలోనూ ఈ ప్రభావం ఉందన్నారు. మావోయిస్టులు స్థానిక పోలీసులు, పారామిలటరీ బలగాలు, ప్రభుత్వ అధికారులపై దాడులు చేస్తున్నారని తెలిపింది. ఈ ముప్పు తీవ్రత కారణంగా అమెరికా ప్రభుత్వ ఉద్యోగులు బిహార్, ఝార?ండ్, ఛత్తీస్‌గఢ్, బెంగాల్, మేఘాలయ, ఒడిశా రాష్ట్రాల్లో చాలా ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. రాష్ట్రాల రాజధానులకు వెళ్తే అనుమతి అవసరం లేదని.. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తూర్పు ప్రాంతానికి వెళ్లడానికి మాత్రం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించింది. ఈశాన్య ప్రాంతాల్లో హింసాత్మక చర్యలకు పలు జాతులకు చెందిన గ్రూపులు పాల్పడుతున్నాయని తెలిపింది. ఈ ఘటనల్లో బస్సులు, రైళ్లు, రైలు మార్గాలు, మార్కెట్లపై బాంబు దాడులు జరుగుతున్నాయని హెచ్చరించింది. కాబట్టి.. భారత్‌లో ఉన్న అమెరికన్లకు హెచ్చరికలు జారీ చేసింది.

# మైనింగ్ పన్ను.. రాష్ట్రాల హక్కు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మైనింగ్‌పై పన్ను వసూల్ చేసే హక్కు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఉంటుందని ఇవాళ సుప్రీంకోర్టు తెలిపింది. 9 మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసులో కీలక తీర్పును వెలువరించింది. మైనింగ్ ఆపరేటర్లు.. కేంద్ర ప్రభుత్వానికి ఇస్తున్న రాయల్టీ.. పన్ను కాదు అని సుప్రీం ధర్మాసనం తెలిపింది. ఇక మైనింగ్‌తో పాటు ఖనిజ తవ్వకాల కార్యకలాపాలపై పన్ను వసూల్ చేసే హక్కు రాష్ట్రాలకు ఉంటుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ధర్మాసనంలో సీజేఐ డీవై చంద్రచూడ్‌తో పాటు జస్టిస్ హృషికేశ్ రాయ్, అభయ్ ఎస్ ఓకా, బీవీ నాగర్నత, జేబీ పర్థివాలా, మనోజ్ మిశ్రా, ఉజ్వల్ భుయాన్, సతీష్ చంద్ర శర్మ, అగస్టిన్ జార్జ్ మాసి, జస్టిస్ నాగరత్న ఉన్నారు. రాష్ట్రాల హక్కులను సమర్థిస్తూ సుప్రీంలో 8:1 తేడాతో ధర్మాసనం అనుకూల తీర్పునిచ్చింది. జస్టిస్ నాగరత్న ఒక్కరే.. రాష్ట్రాల హక్కులకు వ్యతిరేకంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. 1989లో ఇండియా సిమెంట్ వర్సెస్ తమిళనాడు సర్కారు కేసులోఇచ్చిన తీర్పును తోసిపుచ్చింది. మెజారిటీ న్యాయమూర్తులు చెప్పిన అభిప్రాయాలను జస్టిస్ బీవీ నాగర్నత వ్యతిరేకించారు. సీజేఐ చంద్రచూడ్ తీర్పును చదువుతూ .. రాయల్టీని పన్నుగా చూడలేమని, ఇండియా సిమెంట్స్ కేసులో రాయల్టీని పన్నుగా చూపడడం సరికాదు అని, ప్రభుత్వాన్ని చెల్లించే పేమెంట్స్‌ను పన్నులుగా చూడలేమని వెల్లడించారు. మైనింగ్ సంబంధిత అంశాల్లో పన్ను విధించే రాష్ట్రాల హక్కులను కొట్టిపారేయలేమని ధర్మాసనం అభిప్రాయపడింది.

# రైతు వ్యతిరేక బడ్జెట్

-మొదటిపేజీ తరువాయి

పట్ల నిర్లక్ష్యానికి, ఫ్యూడల్ విధానానికి ఇంత గొప్ప నిదర్శనం లేదు. మత్స్యకారులకు భరోసా లేదు. ఇందులో విశేషం ఏంటంటే.. అంకెలు వచ్చినప్పుడల్లా ఆర్థిక మంత్రి ఒత్తిఒత్తి పలకడం తప్ప కొత్తగా ఏం లేదు అని కేసీఆర్ పేర్కొన్నారు.

**అది ఆల్రెడీ ఉన్న స్కీమే..**

మహిళల పట్ల కూడా చాలా విషయాలు స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉండే. ఏదో కొత్తగా లక్ష కోట్ల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని చెప్పారు. అది ఆల్రెడీ ఉన్న స్కీమే. దురదృష్టం ఏందంటే.. ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మేం కూడా కనీసం 6 నెలల సమయం ఇవ్వాలనుకున్నాం. నేను కూడా పెద్దగా శాసనసభకు రాలేదు. కానీ ఈ రోజు బడ్జెట్ చూస్తే.. ఏ ఒక్క పాలసీ ఫార్ములేషన్ జరగలేదు. రాష్ట్రానికి సంబంధించినటువంటి ఏ ఒక్క విషయంలో కూడా ఈ అర్భక ప్రభుత్వం ఇప్పటివరకు పాలసీ ఫార్ములేషన్ చేసినట్టుగా కనబడుతలేదు అని కేసీఆర్ తెలిపారు.

**ఇది పూర్తిగా రైతు శత్రువు ప్రభుత్వం..**

వ్యవసాయం విషయంలో మాకు స్పష్టమైన అవగాహన ఉండే. ఈ రాష్ట్రంలో వ్యవసాయ స్థిరీకరణ జరగాలని, మేం రెండు పంటలకు రైతుబంధు ఇచ్చాం. వీళ్లేమో ఎగ్గొడుతామని చెబుతున్నారు. రైతులకు ఇచ్చిన డబ్బును పాడు చేసినం.. చెడగొట్టినం.. దుర్వినియోగం చేసినం అనే పద్ధతిలో దురదృష్టకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. అంటే ఇది పూర్తిగా రైతు శత్రువు ప్రభుత్వం అని తెలుస్తుంది. ధాన్యం కొనుగోలు చేయలేదు. విద్యుత్ సరఫరా చేయడం లేదు. నీళ్లు సరఫరా చేయడం లేదు. చాలా ఇబ్బందులు పెడుతున్నారు. ఇంకా రైతుబంధు, రైతుభరోసా ప్రస్తావనే లేదు. రైతుభరోసా ఎప్పుడు వేస్తారని మా ఎమ్మెల్యేలు అరిస్తే కనీసం సమాధానం చెప్పడం లేదు. కాబట్టి రైతులను ఈ ప్రభుత్వం వంచించింది. వృత్తి కార్మికులను వంచించింది అని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం



చేశారు. ఇంకా రైతుబంధు, రైతు భరోసా ప్రస్తావనే లేదన్నారు. రైతు భరోసా ఎప్పుడు వేస్తారని తమ ఎమ్మెల్యేలు అడిగితే కనీసం సమాధానం చెప్పడం లేదన్నారు. రైతులను, వృత్తి కార్మికులను ఈ ప్రభుత్వం వంచించిందన్నారు. బడ్జెట్ ప్రసంగంలా కనిపించలేదని... రాజకీయ సభలలో చెప్పినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. పారిశ్రామిక పాలసీ, ఐటీ పాలసీ... ఇలా ఏ అంశంపై స్పష్టత లేదన్నారు.

**బడ్జెట్ ప్రసంగంలా లేదు.. రాజకీయ సభల్లో చెప్పినట్టుగా ఉంది..**

ఇండస్ట్రీయల్ పాలసీ ఏమిటి..? ఏం లేదు వట్టిదే గ్యాస్.. ట్రాష్. ఇదేదో స్టోరీ టెల్లింగ్‌లాగా ఉంది తప్ప బడ్జెట్‌లాగా లేదు. రాష్ట్రంలో వ్యవసాయ పాలసీ ఏమిటి..? పారిశ్రామిక పాలసీ ఏమిటి..? ఐటీ పాలసీ ఏమిటి..? ఇంకా ఇతర అనేక పాలసీలు.. పేద వర్గాలకు సంబంధించిన పాలసీ ఏమిటి..? అనే ఏ ఒక్కదాని మీద కూడా స్పష్టత లేదు. అంత వట్టిదే గ్యాస్, ట్రాషే. చిల్లరమల్లర ప్లాట్‌ఫామ్స్ స్పీచ్ లాగా ఉంది తప్ప అది బడ్జెట్ ప్రసంగంలా లేదు. రాజకీయ సభల్లో చెప్పినట్టుగా ఉంది తప్ప ఏ ఒక్క పాలసీని కూడా నిర్దిష్టంగా ఈ పనిని మేం ఇలా సాధిస్తాం.. మా గోల్స్, టార్గెట్స్ ఇవి అనే పద్ధతి కానీ, పద్దు కానీ లేదు. ఇది పేదల బడ్జెట్ కాదు.. రైతుల బడ్జెట్ కాదు.. ఎవరి బడ్జెటో రేపు మీకు విశ్లేషణలో తెలుస్తది. భవిష్యత్‌లో బ్రహ్మాండంగా చీల్చి చెండాడబోతాం అని కేసీఆర్ తేల్చిచెప్పారు.

# రూ.2,91,191 కోట్లు. తెలంగాణ పూర్తిస్థాయి బడ్జెట్

తెలంగాణ 2024-25 వార్షిక బడ్జెట్‌ను ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రూ.2 లక్షల 91 వేల 159 కోట్లతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా ప్రతిపాదించారు. సంక్షేమం, అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు తెలుస్తోంది. మెట్రో వాటర్ వర్క్‌కు రూ.3,385 కోట్లు, నూతనంగా ఏర్పాటు చేసిన హైడ్రాకు రూ.200 కోట్లు, జీహెచ్‌ఎంసీలో మౌలిక వసతులు కల్పనకు రూ.3,065 కోట్లు, హెచ్‌ఎండీఏలో మౌలిక వసతుల కల్పనకు రూ.500 కోట్లు, వ్యవసాయానికి రూ.72,659 కోట్లు, ఉద్యానవనం రూ.737 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,980 కోట్లు కేటాయించారు. ఇక రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం కోసం రూ.723 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,418 కోట్లు ప్రతిపాదించారు.

హైదరాబాద్:

తెలంగాణ 2024-25 వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టారు. పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత ప్రభుత్వ చర్యల కారణంగా రాష్ట్రం ఎంతో నష్టపోయిందని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో తెలంగాణ రైతాంగం ఎంతో నష్టపోయిందని.. రైతు సాధికారత దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని తక్కువ కాలంలోనే నిరూపించామని భట్టి విక్రమార్క తన ప్రసంగంలో తెలిపారు. వివిధ రంగాలకు కేటాయింపులను ఆయన సభలో వివరించారు. మొత్తంగా రూ.2, 91, 191 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.

రైతులకు గుడ్ న్యూస్..

తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో రైతులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఉద్యానవన పంటలకు ప్రోత్సహం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. హర్టికల్చర్ కోసం ఈ బడ్జెట్‌లో రూ.737 కోట్లను ప్రతిపాదిస్తున్నట్లు ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో నకిలీ విత్తనాల కారణంగా రైతాంగం నష్టపోయిందని.. తమ ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటుందని భట్టి విక్రమార్క సభలో ప్రకటించారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయానికి సాంకేతికతను జోడించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సన్నవడ్లు పండించే రైతులకు క్వింటాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా రైతు దిగుబడిని పెంచుకునేందుకు వీలుగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. టెక్నాలజీని వ్యవసాయానికి



అనుసంధానిచడం తమ ప్రభుత్వ ప్రాధాన్యతగా పెట్టుకున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో పేద ప్రజలను మోసం చేసిందని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పూటగడవని నిరుపేదలకు గూడు సమకూర్చడం ప్రభుత్వ కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిరుపేదలకు ఎన్నో ఆశలు కల్పించి.. ఇళ్లు కేటాయించకుండా దగా చేసిందన్నారు. పేద ప్రజల సొంతింటి కళను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని ప్రారంభించామన్నారు. పేద ప్రజలు ఇళ్లు కట్టుకోవడానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షల సాయం అందించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున మొత్తం రాష్ట్రంలో 4లక్షల 50 వేల గృహాల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని భట్టి విక్రమార్క తెలిపారు.

2.91లక్షల కోట్లతో తెలంగాణ బడ్జెట్..

జీహెచ్‌ఎంసీ పరిధిలో కేటాయింపులు ఇలా..

మెట్రో వాటర్ వర్క్స్- రూ.3,385 కోట్లు

హైడ్రా సంస్థ- రూ.200 కోట్లు

జీహెచ్‌ఎంసీలో మౌలిక వసతులు కల్పన- రూ.3,065 కోట్లు

హెచ్‌ఎండీఏలో మౌలిక వసతుల కల్పన- రూ.500 కోట్లు

విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణ- రూ.100 కోట్లు

హైదరాబాద్ నగర అభివృద్ధికి- రూ10 వేల కోట్లు

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు- రూ.1500 కోట్లు

ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు- రూ1525 కోట్లు

పాతబస్తీ మెట్రో విస్తరణకు- రూ.500 కోట్లు

మల్టీ మోడల్ సబర్బన్ రైల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్- రూ.50 కోట్లు

ఔటర్ రింగ్ రోడ్డుకు- రూ.200 కోట్లు

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు- రూ.500 కోట్లు

కాగా, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ పద్దు రూ. 2.75 లక్షల కోట్లు. పూర్తి స్థాయి బడ్జెట్ కూడా ఓటాన్ అకౌంట్ కంటే కొంత పెరిగే అవకాశం ఉంది. నాలుగు నెలల కాలానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, జూలై నెలాఖరుతో ఓన్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సమయం ముగియనుంది.

యువతలో నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు : ఆర్థిక మంత్రి

ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆకర్షించే అగ్రగామి గమ్యస్థానంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్ది.. స్థానికంగాను, విదేశాల్లోనూ సులభంగా ఉద్యోగాలు పొందడానికి కావాల్సిన ప్రపంచస్థాయి నైపుణ్యాలను తెలంగాణ యువకుల్లో పెంపొందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఇవాల అసెంబ్లీలో బడ్జెట్ ప్రసంగంలో ఆయన ఈ విషయం చెప్పారు. ఇదే ధ్యేయంతో తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే హైదరాబాద్‌లో పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యంతో 'తెలంగాణ నైపుణ్యాల విశ్వవిద్యాలయం ను స్థాపించి, నడిపించాలని నిర్ణయిచిందని భట్టి తెలిపారు. ఈ విశ్వవిద్యాలయంలో వివిధ పరిశ్రమలకు అవసరమైన 17 రకాల నైపుణ్యాలను నేర్పనున్నట్లు చెప్పారు. వీటిలో సర్టిఫికెట్, డిప్లమో, డిగ్రీ కోర్సులు ఉంటాయన్నారు. ఈ స్కిల్ యూనివర్సిటీ నేరుగా పరిశ్రమలతో అనుసంధానించబడి ఉంటుందని.. అధ్యయనం, ఆచరణల మధ్య అంతరంలేని విధంగా ఉద్యోగార్జనే ఏకైక లక్ష్యంగా ఈ కోర్సుల బోధనాంశాలకు రూపకల్పన చేస్తామని మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

**విశ్రాంతి తీసుకోమని కేసీఆర్‌కే ప్రజలు సమయమిచ్చారు: భట్టివిక్రమార్క చురక**

తమకు సమయం ఇచ్చానని కేసీఆర్ అంటున్నారని... కానీ వారు మాకు సమయం ఇచ్చేదేమిటి? విశ్రాంతి తీసుకోమని ప్రజలే వారికి సమయం ఇచ్చారని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బడ్జెట్ ప్రసంగంపై కేసీఆర్ విమర్శలు చేసిన విషయం తెలిసిందే. మీడియా పాయింట్ వద్ద భట్టివిక్రమార్క మాట్లాడుతూ... కేసీఆర్ నిన్న సభకు ఎందుకు రాలేదో చెప్పాలన్నారు. ఇప్పుడు హడావుడిగా వచ్చి బడ్జెట్‌పై విమర్శలు చేస్తున్నారని, అంతే హడావుడిగా కేంద్ర బడ్జెట్‌పై ఎందుకు స్పందించలేదో చెప్పాలన్నారు. పక్క రాష్ట్రానికి కేంద్రం నిధులు ఇచ్చిందని, కానీ మన రాష్ట్రం మాటేమిటన్నారు. రాష్ట్రానికి మేలు చేయడానికి తెచ్చిందే రాష్ట్ర విభజన చట్టం అన్నారు. మనకు నిధులు కేటాయించకుంటే కేసీఆర్ ఎందుకు ప్రశ్నించలేదన్నారు.

కేసీఆర్‌ను తప్పకుండా జైలుకు పంపిస్తాం

కేసీఆర్‌ను తప్పకుండా జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌పై కేసీఆర్ విమర్శలు సరికాదన్నారు. కేసీఆర్‌ను జైలుకు పంపించే బాధ్యతను తీసుకుంటామని సంచలన వ్యాఖ్యలు చేశారు. మీడియా పాయింట్‌కు వచ్చిన నువ్వు కోర్టు బోనుకు కూడా వెళతావ్ అన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు పెద్దపీట వేశామన్నారు.

## రాష్ట్రానికి అన్యాయం జరిగింది..

-మొదటిపేజీ తరువాయి

మల్లు రవి మాట్లాడుతూ... విభజన చట్టంలో ఇచ్చిన హామీలను కేవలం ఏపీకి మాత్రమే అమలు చేసేలా బడ్జెట్‌లో హామీలు, కేటాయింపులు ఉన్నాయన్నారు. తెలంగాణలోని పాత తొమ్మిది జిల్లాలకు వెనుకబడిన ప్రాంతాల కింద నిధులు ఇస్తామని చెప్పి దాని గురించి బడ్జెట్‌లో ఏమీ మాట్లాడలేదన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై ప్రధాని మోదీకి, కేంద్ర ఆర్థిక శాఖకు లేఖలు రాసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలపై బీజేపీతో బీఆర్ఎస్ రాజీపడిందని విమర్శించారు. తెలంగాణకు న్యాయం జరిగే వరకు పార్లమెంట్‌లో పోరాడుతామన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని బీజేపీ ఎంపీలు వమ్ము చేశారన్నారు. కేంద్రమంత్రివర్గంలో తెలంగాణ నుంచి ఇద్దరు ఉన్నప్పటికీ న్యాయం జరగలేదన్నారు. విభజన చట్టం 2014లో ఉంటే నాటి నుంచి లేని కేటాయింపులు ఈసారి బడ్జెట్‌లోనే ఎందుకు చేశారో చెప్పాలన్నారు. ప్రధాని కుర్చీని కాపాడుకోవడానికే నితీశ్‌కు చెందిన బీహార్, చంద్రబాబుకు చెందిన ఏపీ రాష్ట్రాలకు న్యాయం చేశారని విమర్శించారు. బీజేపీ ఎంపీలకు చిత్తశుద్ధి ఉంటే తెలంగాణకు జరిగిన అన్యాయంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ + రాష్ట్ర బడ్జెట్ = గాడిద గుడ్డేనా?

-మొదటిపేజీ తరువాయి



6 గ్యారంటీలుసహా హామీల అమలుపై చర్చ జరగకుండా ఉండేందుకే కేంద్రాన్ని బదనాం చేయాలనుకుంటున్నారా? బడ్జెట్ కేటాయింపులకు సరిపడ ఆదాయం ఎక్కడి నుండి సమకూర్చుకుంటారో బడ్జెట్ లో లెక్కా పత్రం చూపకపోవడం విడ్డూరమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. సర్కారీ భూములన్నీ అడ్డికి పావుశేరు అమ్మాలనుకుంటున్నారా? ఔను. హామీలను అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ కు మాటలెక్కువని బడ్జెట్ చూస్తే అర్ధమవుతోంది. 12 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇచ్చిన మీరు 31 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పడం నిరుద్యోగులను మోసం చేయడమే. .లక్షన్నర కోట్లతో నిర్మిస్తామన్న మూసీ రివర్ ఫ్రంట్ కు బడ్జెట్ లో పైసా కేటాయించని మీరా కేంద్రంపై విమర్శలు చేసేది? రంజాన్ వేడుకలకు రూ.33 కోట్లు కేటాయించిన ప్రభుత్వం హిందువుల పండుగలకు నయాపైసా కేటాయించకపోవడం మతతత్వం కాదా? ఒక వర్గం ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ మెజారిటీ హిందూ ప్రజలకు తీవ్రమైన నష్టం చేయడమేనా మైనారిటీ డిక్లరేషన్ అంటే? రుణమాఫీవల్ల రైతులకు లాభం కంటే నష్టమే జరిగిందని ప్రభుత్వమే ఒప్పుకుంది.

రైతులకు జరిగిన నష్టాన్ని పూడ్చి డిఫాల్టర్ల జాబితా నుండి తొలగిస్తారా? లేదా? చెప్పాలి ఏడాదిపాటు నష్టపోయిన రైతు భరోసా, రూ.500 బోనస్, పంట నష్ట పరిహారం నిధులను కూడా ఈ ఏడాది చెల్లిస్తారా? లేదా? జాతీయ వృద్ధి రేటు కంటే తెలంగాణ వృద్ధి రేటు తక్కువ నమోదు కావడమే 10 ఏళ్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనకు అద్దం పడుతుందని అన్నారు. ఇప్పటికైనా పీఎం ఫసల్ బీమాలో చేరాలని నిర్ణయించడం సంతోషం. 90 లక్షల తెల్ల రేషన్ కార్డులుంటే. 39 లక్షల మందికే గ్యాస్ సబ్సిడీ ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం దారుణం. 50 లక్షల మంది అర్హులకు రూ.500 సబ్సిడీని ఎగ్గొట్టి మహిళల్లో వెలుగులు నింపామని చెప్పుకోవడం సిగ్గు చేటు. ఇందిరమ్మ ఇండ్లు, ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో కేంద్ర నిధులున్నాయని బడ్జెట్ లో ప్రస్తావించకపోవడం విడ్డూరం.

బడ్జెట్ లోని చివరి పేజీలో ప్రస్తావించిన మహాత్ముడి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులకు. మీరిచ్చిన అలవి కాని హామీలకు మధ్య ఉన్న అంతరాన్ని గ్రహించండి. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను రాబోయే ఐదేళ్లలో కూడా అమలు చేయడం అసాధ్యమని బడ్జెట్ లోనే తేలింది. బడ్జెట్ లో ఏ ఒక్క నియోజకవర్గం ఊసే లేదు. సీఎంసహా మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తారా? కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ పేరు రాలేదని. రాష్ట్రానికి ఘోర అన్యాయం ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్ నేతలు రాష్ట్ర బడ్జెట్ లో ఏ ఒక్క జిల్లా, నియోజకవర్గం ప్రస్తావన చేయలేదు కదా. దీనికేం సమాధానం చెబుతారు? బడ్జెట్ లో పేరు ప్రస్తావించకపోయినంత మాత్రాన ఆ ప్రాంతాలకు అన్యాయం చేసినట్లా? రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తారా

## కాళేశ్వరం నుంచి ఎన్ని టీఎంసీల నీటిని ఇచ్చారు..?



-మొదటిపేజీ తరువాయి

రాలేదు కానీ రూ. 2 వేల కోట్లతో మూడో టీఎంసీ నీటి గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. వర్షాకాలంలో నీళ్లు వస్తున్నాయి.. కానీ తాము కడితేనే వస్తున్నాయని చెప్పుకునే ప్రయత్నం బీఆర్ఎస్ నేతలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్లంపల్లి, మిడ్ మానేర్ ప్రాజెక్టు ద్వారా నీళ్లు వెళ్తాయన్నారు. ముంపు గ్రామాల సమస్య ఎందుకు పరిష్కరించలేదో చెప్పి రావాలని అడిగారు. అధికారంలో ఉన్నప్పుడు నిర్వాసితులను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మూడో టీఎంసీ నీటిని ఎవరి లబ్ధి కోసం అడుగుతున్నారో చెప్పాలని నిలదీశారు. యాదవులకు ఉన్న బకాయిలను తాము అధికారంలోకి వచ్చాక తమ జిల్లాల్లో ఇప్పుడు పరిష్కారిస్తున్నామని అన్నారు. 7 నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని.. మరి పదేళ్ల ప్రభుత్వంపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. యాదవులకు చెందిన 8500 డీడీలు గత ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. తెలంగాణ గురించి మాజీ సీఎం కేసీఆర్ నిన్న ప్రెస్ మీట్ పెడితే బాగుండేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు (%ఖుశ్రీవంష్ట్రఝుతీఝఎ జూతీశీయవష్%) సందర్శించేందుకు ఈరోజు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత వారు బయలుదేరినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ నుంచి భారీ ర్యాలీగా ప్రత్యేక బస్సుల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లారు. కాళేశ్వరం చేరుకుని మొదటగా %ాావీణ% రిజర్వాయర్ సందర్శించనున్నారు. అనంతరం గురువారం రాత్రి రామగుండంలో బీఆర్ఎస్ నేతల బృందం బస చేయనుంది. శుక్రవారం (రేపు) 10 గంటలకు కన్నెపల్లి పంపు హౌజ్, 11గంటలకు మేడిగడ్డ బ్యారేజీలను వారు సందర్శిస్తారు. అనంతరం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఈ పర్యటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు కాళేశ్వరంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని గులాబీ నేతలు మండిపడుతున్నారు. ప్రాజెక్టు పగుళ్లు, ఇసుకలో కూరుకుపోతోందంటూ చేసే ప్రచారాలు మానుకోవాలని హితవు పలుకుతున్నారు. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆధ్వర్యంలోనూ బృందం పర్యటనకు వెళ్లనుండటంతో రాజకీయంగా ఆసక్తి వాతావరణం నెలకొంది.

# వన మహోత్సవంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్




వాస్తవ నేస్తం భీంపూర్: మండలంలోని అర్లీ(టీ) గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమంలో గురువారం ముఖ్యఅతిథిగా అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొని పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం పాఠశాలను సందర్శించారు,విద్యార్థులను ప్రశ్నలు అడిగి పటన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను సూచించారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీడిసి సభ్యులు గ్రామంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తామని హామీ ఇచ్చారు. కరంజి టీ రోడ్డు అధ్వనంగా మారడంతో గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన రోడ్డు సంక్షన్ అయిందని వర్షాకాలం తర్వాత రోడ్డు పనులు ప్రారంభమవుతుందని తెలిపారు.. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ సత్యనారాయణ,ఎంపీడీవో గడ్డం గోపాల కృష్ణ రెడ్డి,మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, విడీసి అధ్యక్షుడు నవీన్,సభ్యులు బొంత నితిన్,గ్రామస్తులు, ఉపాధ్యాయులు, అధికారులు,ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్టియుటిఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** పిఆర్టియుటిఎస్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక అయినట్లు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు గౌడ్ గురువారం తెలిపారు. మండల అధ్యక్షులు గా బి.కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గాండ్ల రాజశేఖర్ మండల అసోసియేట్ అధ్యక్షులుగా పవన్ కుమార్, మహిళ ఉపాధ్యక్షురాలిగా మమత, కార్యదర్శిగా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిఆర్టియు సంఘం ఉద్యమ స్ఫూర్తితో పనిచేస్తున్నదని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో సంఘం ఎనలేని కృషి చేస్తున్నదని, పిఆర్టియు సంఘం ప్రాతినిధ్యం మేరకు బదిలీలు, పదోన్నతులు జరిగాయని, సిపిఎస్ విధానం రద్దు చేయాలనీ, ఎస్ జి టి ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా ప్రతి ప్రాథమిక పాఠశాల కి పిఎస్ హెచ్ఎం పోస్టు మంజూరు చేయాలనీ, జీవో 317 బాధిత ఉపాధ్యాయులని సొంత జిల్లాలకు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షులు శేర్ల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు ఇల్తెపు శంకర్, ఆర్మూర్, నిజామాబాద్, బోధన్ డివిజన్ ఇంచార్జి లు లక్ష్మణ్ పటేల్,ప్రవీణ్ రెడ్డి, శంకర్, గంట అశోక్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కృష్ణ చారి, దశెందర్, అబ్దుల్ జావీద్ గటడి భాస్కర్,, నవీన్ రెడ్డి, సుధాకర్, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం ఉంది
### – బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు



**వాస్తవ నేస్తం,బెల్లంపల్లి:** తెలంగాణ రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందని అందుకు నిదర్శనం తెలంగాణ రాష్ట్రానికి ఇప్పటివరకు 8 లక్షల కోట్లకు పైగా వివిధ పథకాలకు నిధులు మంజూరు చేసిందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు అన్నారు.ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం వివక్ష చూపుతుందని అనడం సరైనది కాదని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా వివిధ పథకాలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 32,414 కోట్లు,వ్యవసాయ రంగ ఆధునీకరణ మరియు అభివృద్ధి కోసం1,345 కోట్లు, పన్నుల్లో వాటా కింద 1,96,420 కోట్లు,సమగ్ర శిక్ష అభియాన్ కింద 8,114 కోట్లు, మహిళలు గర్భిణీలు చిన్నారుల కోసం అంగన్వాడి సౌకర్యాల పెంపు కోసం 9,172 కోట్లు, గిరిజన విశ్వవిద్యాలయం కోసం 980 కోట్లు, కంపా పథకానికి 4,018 కోట్లు, పెన్షన్ల కోసం 2078 కోట్లు, 14వ ఆర్థిక సంఘం నిధుల కింద 8769 కోట్లు,15వ ఆర్థిక సంఘం నిధుల కింద 10,882 కోట్లు, ప్రధానమంత్రి ఆవాస యోజన కింద 9597 కోట్లు, స్మార్ట్ సిటీ యోజన కింద 500 కోట్లు,అమృత్ పథకానికి 3856 కోట్లు, రామగుండం ఎన్టిపిసి కోసం 10,997 కోట్లు,విద్యుత్ రంగ బలోపేతం కోసం 786 కోట్లు, సాగునీటి ప్రాజెక్ట్ ల నిర్మాణం కోసం 2438 కోట్లు, జాతీయ రహదారుల ఏర్పాటు విస్తరణ కోసం 1,58,000 కోట్లు, రైల్వే అభివృద్ధి కార్యక్రమాల కోసం 34,992 కోట్లు, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద 3672 కోట్లు, జల్ జీవన్ మిషన్ కింద 1588 కోట్లు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద 10,086 కోట్లు, రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ధాన్యం సేకరించడం కోసం 1,86,640 కోట్లు, రైతులకు ఎరువుల సబ్సిడీ కోసం 46,000 కోట్లు, రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ కోసం 6338 కోట్లు, వరంగల్ ఆదిలాబాద్ మెడికల్ కాలేజీలకు 240 కోట్లు, ఆయుష్మాన్ భారత్ ద్వారా వెల్ నెస్ సెంటర్ల ఏర్పాటు కోసం 902 కోట్లు, జాతీయ ఆరోగ్య మిషన్ కింద 6968 కోట్లు, కరోనా వ్యాక్సిన్ ల కోసం 1800 కోట్లు, స్వచ్ఛభారత్ అభియాన్ కోసం 4418 కోట్లు, ప్రధానమంత్రి స్వనిధి యోజన కింద 848 కోట్లు, ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద 1425 కోట్లు, రీజనల్ రింగ్ రోడ్డు కోసం 20,000కోట్లు, ప్రధానమంత్రి ముద్ర యోజన కింద 58,471 కోట్లు, విద్యావిభాగంలో వివిధ పథకాల కోసం 12,548 కోట్లు, షెడ్యూల్ కులాలు, తెగల అభివృద్ధి కోసం 3014 కోట్లు, పర్యాటక రంగ అభివృద్ధి కోసం 958 కోట్లు, మైనారిటీ సంక్షేమ పథకాలు అమలు కోసం 1214 కోట్లు ఈ విధంగా తెలంగాణ రాష్ట్రానికి మొత్తం 8,62,488 కోట్లు కేటాయించిందని అన్నారు. కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి ఏనాడు వివేక్ష చూపించలేదని చూపించదని అన్నారు. తెలంగాణ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ఎంపీలు పాటుపడతారని అందుకే బిజెపి ఎంపీలను ప్రజలు గెలిపించారని అన్నారు. బిజెపి ఎంపీలు తెలంగాణ ప్రజల విశ్వాసాలను నమ్మకాలను వమ్ము చేయరని తెలంగాణ అభివృద్ధిలో బిజెపి ఎంపీల పాత్ర క్రియాశీలకంగా ఉంటుందని అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీలు ఒకటేనని తెలంగాణ ప్రజలను నమ్మించి మోసం చేయడమే వీరి నైజం అని అన్నారు.

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు
### - డాక్టర్ పీటర్ నాయక్ లకావత్



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గోనేనాయక్ తండాకు చెందిన విద్యార్థిని బాదావత్ మధులత అనే విద్యార్థిని జేఈఈలో ర్యాంకు ద్వారా పాట్నా ఐఐటీలో సీటు సాధించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆమెకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. బాదావత్ మధులత 'ఐఐటీకి వెళ్లలేక....మేకల కాపరిగా' అనే శీర్షికతో వార్తాపత్రికల్లో వచ్చిన కథనంపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఆ పేదింటి చదువులతల్లికి తక్షణమే సహాయం అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సచివాలయంలో గిరిజన శాఖ కార్యదర్శి శరత్ గారి ద్వారా విద్యార్థిని మధులతకు రూ 1,51,831 చెక్కును అందజేశారని తెలుసుకున్న ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ సమితి డాక్టరేట్ అవార్డు గ్రహీత పీటర్ నాయక్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఫౌండర్ మరియు నేషనల్ నింబుల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సీనియర్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పీటర్ నాయక్ లకావత్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్రమములో డాక్టర్ పీటర్ నాయక్ మాట్లాడుతూ, ఇదే తరహాలో ఆణిముత్యంల అన్ని తెలివితేటలు ఉండియుకూడా కేవలం ఆర్థిక సహాయంలేక ఎందరో గిరిజన యువతీ యువకులు తెలంగాణ రాష్ట్రములో బాధపడుతున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. కాబట్టి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తమ ప్రభుత్వంలో అణగారిన నిరుపేద విద్యార్థులపట్ల ప్రత్యేకంగా దృష్టి సారించాలని డాక్టర్ పీటర్ నాయక్ లకావత్ సూచించారు. అనంతరం షెడ్యూల్ ట్రైబల్ కో-ఆపరేటివ్ ఫైనాన్షియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రైకార్) చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ గారు మరియు గిరిజన శాఖ అధికారులకు డాక్టర్ పీటర్ నాయక్ ధన్యవాదములు తెలిపారు.

## విద్యార్థులకు బుక్స్ అందజేసిన మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం శివనగర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో హెట్రో సహకారంతో విద్యార్థిని విద్యార్థులకు బుక్స్, బ్యాగ్స్ స్టేషనరీ వస్తువులను విద్యార్థులకు జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు నాణ్యతమైన విద్యను అందించడానికి ప్రభుత్వంతోపాటు హెట్రో యాజమాన్యం సహకారంతో విద్యార్థులకు బుక్స్ బాక్స్ స్టేషనరీ వస్తువులను అలాగే యూనిఫామ్స్ కూడా అందిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఈ సంవత్సరం ప్రతి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఇంటర్నెట్ తో సాంకేతికపరమైన టీవీ స్క్రీన్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు మరింత విజ్ఞానాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. విద్యార్థులు కూడా ఇలాంటి సదుపాయాలు వినియోగించుకొని మంచిగా చదువుకొని మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించి గ్రామానికి మండలానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అలాగే పాఠశాల నిర్వహణ మెయింటెనెన్స్ కొరకు సోలక్ పల్లి మాజీ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి సంవత్సరానికి 20వేల రూపాయలు చొప్పున ఐదు సంవత్సరాలు అందిస్తానని ఉపాధ్యాయులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి స్థానిక మాజీ ఎంపిటిసి భత్తుల సంతోష మహేష్ . నర్సింలు మహేష్ గౌడ్ రాజు గౌడ్ సత్యనారాయణ ఉపాధ్యాయులు నాయకులు పాల్గొన్నారు.

## కొడకంచి'లో ఘనంగా బోనాల ఉత్సవాలు
**ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్డె కృష్ణ**



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం కొడకంచి గ్రామంలో గ్రామదేవతల దుర్గమ్మ పోచమ్మల బోనాలు ఘనంగా సమర్పించారు. ప్రతి ఏడాది వచ్చే ఆషాడ మాస బోనాలు ఉత్సవాలు కొడకం చిలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ నేపథ్యంలో గురువారం రోజున గ్రామ దేవతలకు కల్లు సాకలతో పట్టు వస్త్రాలు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించు కోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డె కృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సంప్రదాయానికి చిహ్నమైన బోనాన్ని ప్రతి ఏటా ఘనంగా జరుపుకోవడం ఎంతో విశేషంగా ఉందని పేర్కొన్నారు, బోనాల ఉత్సవాల సందర్భంగా గ్రామదేవతలకు దుర్గమ్మ పోచమ్మ ఎల్లమ్మ మైసమ్మ పెద్దమ్మ ముత్యాలమ్మలకు పసుపు కుంకుమలు చీర సారెలు భోజన నైవేద్యాలతో మొక్కులు చెల్లించారని గ్రామంలో ప్రతి ఏటా బోనాల ఉత్సవాలు ఎంతో విశేషంగా ఆకట్టుకుంటున్నాయని గ్రామంలోని పండుగ వాతావరణం ఎల్లవేళలా పశు పాడి పంటలు బాగా అభివృద్ధి చెందాలని పేర్కొనడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తాజా మాజీ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు యువత తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గ జిన్నారం మండల పరిధిలోని అమ్మవారి బోనాల మహోత్సవంలో పాల్గొన్న బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి జిన్నారం నాయకులు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజేందర్ రెడ్డి సీనియర్ నాయకులు అంజి బాబు అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్త మండల అధ్యక్షులు జగన్ రెడ్డి, రాజిరెడ్డి, దోమాడు రమేష్, మండల ఉపాధ్యక్షులు పూదూరి సుధాకర్, మండల సెక్రెటరీ సీత రాజు, మరియు జిన్నారం నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ.



**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. వర్షాకాలం దృష్ట్యా సిజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం అధికంగా ఉన్నందున వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు చికిత్సలు అందించాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ప్రసవాల గురించి, వారికి అందిస్తున్న సేవలు గురించి మండల వైద్యాధికారి శ్యాంసుందర్ ను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీల పట్ల ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి చికిత్స అందించేలా చొరవ తీసుకోవాల్సిన బాధ్యత ఆశ కార్యకర్తలపై ఉందన్నారు. ఆయన వెంట వైద్యాధికారి శ్యాంసుందర్, ఫార్మసిస్ట్ శివాజీ, సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com